క్లుప్తంగా

సత్యదేవుని దర్శించిన రాష్ట్ర సమాచార కమిషనర్



సత్యదేవుని సన్నిధిలో ఉదయ్ భాస్కర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం: రాష్ట్ర సమాచార కమిషనర్ ఎ.ఉదయ్ భాస్కర్‌రెడ్డి శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

శివలింగం పునఃప్రతిష్ఠ



ఏలేరు నది ఒడ్డున పునఃప్రతిష్ఠించిన శివలింగం వద్ద వీహెచ్‌పీ ప్రతినిధులు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శివలింగాన్ని పునఃప్రతిష్ఠించారు. గతంలో ఏలేరు కాలువను ఆనుకుని బ్రాహ్మణ రేవులో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఇటీవల వచ్చిన వరదలకు శివలింగం కాలువలోకి జారిపోయింది. దీంతో విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీపీ ప్రసాద్, కటకం కిరిటీ ఆధ్వర్యంలో శివలింగాన్ని పునఃప్రతిష్ఠించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు పూజలు చేసుకొనేందుకు వీలుగా శివలింగాన్ని పునఃప్రతిష్ఠించినట్టు తెలిపారు. కార్యక్రమంలో హిందూ పరిషత్ ప్రతినిధులు తూముబొతు గురయ్య, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

170 మందికి కంటి పరీక్షలు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సంకురాత్రి ఫౌండేషన్, కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు గీతాప్రియ, సుమిత 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 40 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి తరలించారు. కంటి సంరక్షణపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అమర నరసింహమూర్తి, మైరాల కనకారావు పాల్గొన్నారు.

ప్రజాహక్కుల ర్యాలీ కరపత్రాల ఆవిష్కరణ

ఏలేశ్వరం: మత రాజకీయాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 4న విజయవాడలో నిర్వహించే ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో శనివారం ప్రజాహక్కుల ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ ప్రజాహక్కుల ర్యాలీకి ప్రతిఒక్కరూ మద్దతు ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు ప్రజలపై కపటప్రేమ ప్రదర్శించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి ఒక్క ఫించన్లకే పరిమితమైందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానం మాజీ చైర్మన్ రామ్‌కుమార్‌కు నివాళులు

అన్నవరం: రత్నగిరి దేవస్థానం ఐదో అనువంశిక ధర్మకర్త, ఆలయ మాజీ చైర్మన్ రాజా ఐవీ రామ్ కుమార్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. చైర్మన్ బంగ్లాలో రామ్‌కుమార్ చిత్రపటానికి ఆయన కుమారుడు, ప్రస్తుత దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. దేవస్థానం ఉద్యోగులు, స్థానిక వ్యాపారవేత్త వీర్ల సూరిబాబు, మాజీ ట్రస్టీ పేరూరి బద్రీ, అన్నవరం సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా, ఎంపీటీసీ దడాల సతీష్ తదితరులు రామ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

అవినీతి నివారణకు కృషి చేయాలి

గండేపల్లి: అవినీతిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సూచించారు. సూరంపాలెం పవర్ గ్రిడ్‌లో విజిలెన్స్ ఆధ్వర్యంలో శనివారం అవినీతి రహిత సమాజం వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిని అరికట్టడంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు అవినీతికి తావులేకుండా అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం పవన్ కుమార్, జగ్గంపేట సీఐ శ్రీనివాస్, పవర్‌గ్రిడ్ మేనేజర్లు కోటేశ్వరావు, వీరేంద్ర, మూర్తి పాల్గొన్నారు.

నిరుపయోగం.. అలంకారప్రాయం

- అల్లిపూడిలో అక్కరకు రాని భారీ మంచినీటి ప్రాజెక్టు
- రూ.కోట్లు ఖర్చు చేసినా నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ప్రాజెక్టును పునరుద్ధరించాలని స్థానికుల విజ్ఞప్తి



అల్లిపూడిలో నిర్మించిన మినరల్ వాటర్ ప్రాజెక్టు



తాగునీటి సరఫరాకు ఏర్పాటు చేస్తున్న పైపులైన్ (ఫైల్)

కోటనందూరు: నియోజకవర్గంలోని ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. మండలంలోని అల్లిపూడిలో గతంలో భారీ మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. అనేక ఇబ్బందుల నడుమ ప్రజల ఆకాంక్ష, ప్రభుత్వ ఆశయం నెరవేరకపోగా రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన పథ కం అలంకార ప్రాయంగా దర్శమిస్తోంది. ఐదెకరాల్లో నిర్మించిన భవనం, అందులో అమర్చిన యంత్ర సా మగ్రి శిథిలావస్థకు చేరుతున్నాయి. దశాబ్ద కాలంగా ఈ పథకం నిరుపయోగంగా పడి ఉన్నా సంబంధిత అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. ఈ ప్రాజెక్టు ను పునరుద్ధరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

2011లో ప్రారంభం

తుని, కోటనందూరు మండలాల్లో వేసవిలో భూగర్భ జలాలు అడుగంటుతాయి. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఫ్లోరైడ్ పీడిత, ఉప్పునీరు మాత్రమే లభించే గ్రామాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు (మినరల్ వాటర్) అందించే లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో భారీ మంచినీటి పథకాన్ని ప్రారంభించింది. దీనికోసం అల్లిపూడిలో ఐదెకరాల స్థలాన్ని సేకరించి రూ.25 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. రూ.18 కోట్ల వరకూ ఖర్చు చేసి 47 గ్రామాల్లో 80 కిలోమీటర్ల మేర పైపులైనుతో పాటు నీటిని శుద్ధి చేసేందుకు నిర్మించిన భవనంలో భారీగా యంత్ర సామగ్రిని అమర్చారు. పథకం 2015 నాటికి పూర్తి చేసి బాధిత గ్రామాలకు రక్షిత తాగునీరు అందించాల్సి ఉంది. కాగా 10 సంవత్సరాల పాటు పనులు కొనసాగి చివరకు పథకాన్ని పట్టించుకోకుండా వదిలేశారు.

ప్రాజెక్టు వివరాలు

నిర్మాణం చేపట్టిన సంస్థ : మెయిల్
అంచనా వ్యయం : రూ. 25 కోట్లు
ప్రారంభం : జనవరి 2011
గ్రామాలు : 47
పైపులైను పొడవు : 80 కిలోమీటర్లు
ఖర్చు చేసిన మొత్తం : రూ.18 కోట్లు
ప్రాజెక్టు సామర్థ్యం : 12 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్లు పర్ డే)
లబ్ధి పొందే జనాభా 1.59 లక్షలు

ప్రాజెక్టును పునరుద్ధరించాలి



ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసినా మినరల్ వాటర్ ప్రాజెక్టు అసంపూర్తిగా మిగిలిపోయింది. చేసిన ఖర్చంతా బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన పైపులైను, భవన నిర్మాణం, యంత్ర సామగ్రి శిథిలావస్థకు చేరాయి. ఈ ప్రాజెక్టుపై అధికారులకు చిత్తశుద్ధి లేదు. కొద్దిపాటి నిధులు ఖర్చు చేస్తే ప్రాజెక్టు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. సాధ్యంకాని పక్షంలో మరో అవసరానికి వినియోగిస్తే ప్రభుత్వ నిధులు సద్వినియోగం అవుతాయి.

చినబాబు, అల్లిపూడి, కోటనందూరు మండలం

భవనం శిథిలమవుతోంది



తాగునీటి ప్రాజెక్టు భవనాన్ని ఎప్పుడో పదేళ్ల క్రితం నిర్మించారు. వినియోగంలో లేకపోవడంతో భవనం క్రమంగా శిథిలమైపోతోంది. అందులో అమర్చిన యంత్రాలు సైతం తుప్పు పట్టేశాయి. ప్రాంగణమంతా చిందరవందరగా మారింది. ఊరు శివారులో ఉన్న ఈ ప్రాజెక్టు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

రుత్తల పాపయ్య, స్థానికుడు, అల్లిపూడి

ఎన్నికల హామీ అమలు చేయాలి



ప్రత్తిపాడులోని దీక్షా శిబిరం వద్ద ప్రసంగిస్తున్న వలంటీర్ల సంఘ నాయకులు

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని వలంటీర్ల సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారం కోరుతూ ప్రత్తిపాడు ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద వలంటీర్లు చేస్తున్న రిలే దీక్షలు శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, వలంటీర్ల యూనియన్ నాయకులు ఎస్.జాకబ్, ఎం.సతీష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ నెల 6న జరిగే కేబినెట్ సమావేశంలో వలంటీర్లకు ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. వలంటీర్ల హామీ అమలు కాని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వలంటీర్ల సంఘ నాయకులు పి.భవానీ, దొర, ప్రశాంతి, శ్రీదేవి, ముత్యాలు, పార్వతి, ఎం.లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం



ధర్మవరంలో మురళీరాజును కలసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ప్రత్తిపాడు రూరల్: నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు (మురళీరాజు) తెలిపారు. మండలంలోని ధర్మవరంలో మురళీరాజును శనివారం వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు మండల అధ్యక్షుడు రామిశెట్టి బులిరామకృష్ణ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను), పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళీరాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, పార్టీ నేతలను సమన్వయం చేసుకుంటూ పార్టీ పటిష్ఠతకు పాటుపడతానన్నారు. పార్టీ శ్రేణులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎంపీటీసీలు ఉమ్మిడి తాతీలు, సాధనాల అప్పారావు, సొసైటీ మాజీ చైర్మన్ కొప్పన గంగారావు, సారిపల్లి గంగరాజు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



అచ్చంపేటలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

తొండంగి: మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెంలో శనివారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు అందిస్తున్న రాయితీలు, యంత్రాల వినియోగం, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై ఉద్యాన శాఖ అధికారులు అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ జి.విజయలక్ష్మి, నరహరిశెట్టి ప్రకాష్, వీఏఏ రామ్‌ప్రసాద్, రామారావు, అయ్యప్ప, సత్యనారాయణ తదితరుల పాల్గొన్నారు.

నీమాస్త్రంతో ఆకు ముడత తెగులు నివారణ

శంఖవరం: నీమాస్త్రంతో వరి పంటలో ఆకు ముడత పురుగును నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి, అచ్చంపేట గ్రామాల్లో వరి సాగును శనివారం ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు క్రాంతి, శ్రావణి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య అధ్యయనానికి ప్రత్యేక బృందం



అస్సాగో ఫ్యాక్టరీలో కాలుష్య అధ్యయన బృంద సభ్యులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే వ్యర్థాల నుంచి కాలుష్యాన్ని అధ్యయనం చేసేందుకు శనివారం ప్రత్యేక బృందం వచ్చింది. హైదరాబాద్ ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఏజీ రావు, అనంతపురం జేఎన్‌టీయూ హెడ్ కెమికల్ ఇంజనీర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, నందిగామకు చెందిన బయో స్పిరిట్ ప్లాంట్ హెడ్ కె.దేవేంద్ర, పొల్యూషన్ డిపార్ట్‌మెంట్ ఈఈ శంకర్, ఇండస్ట్రీస్ ఏడీ ప్రదీప్, స్వాతి, ఇంచార్జి తహసీల్దార్ ఎంవీ సాయి ప్రసాద్ ఫ్యాక్టరీని సందర్శించి అన్ని విభాగాలను పరిశీలించారు. ఫ్యాక్టరీ యజమాన్యంతో సమావేశమయ్యారు. వీరు రెండు రోజుల పాటు ఫ్యాక్టరీ, గ్రామంలో పర్యటించి కాలుష్య అధ్యయనంపై కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందించనున్నట్టు తెలిసింది.

రీ సర్వే గ్రామసభకు 40 దరఖాస్తులు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి 40 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ మురార్జీ తెలిపారు. ఆయా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలంటూ ఆందోళన



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: పెండింగ్‌లో ఉన్న వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ప్రత్తిపాడులో శనివారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించే సమయంలో కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఫీజు రియింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, తల్లికి వందనం పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతికి అందజేశారు. కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ నాయకులు సీహెచ్ నరసింహమూర్తి, గంగాధర్, సాయి, సిద్దు, సాత్విక, ప్రసన్న, వెంకట్, రాజేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు



డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తుని రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే మంచి సమాజం ఏర్పడుతుందని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత అన్నారు. వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రక్త నమూనాలు సేకరించి హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తహీనత వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ముఖ్యంగా బాలికలు, యువత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం .శ్రీనివాసు, అధ్యాపకులు డాక్టర్ ఎ.పుష్పలత, ఎస్. ఇందిరా ప్రియాంక, వైద్య సిబ్బంది ఎస్‌జే.రత్నకుమారి, ఎడిఎస్.భవానీ, బివిఎస్.నాగేశ్వరరావు, ఆర్.సన్యాసయ్య, ఎం.భవానీప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన



ద్రవ జీవామృతం తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆదర్శ రైతు అప్పలస్వామి

గోకవరం: మండలంలోని వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌ను డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు శనివారం సందర్శించారు. గ్రామీణ ఉద్యాన పని అనుభవం కార్యక్రమంలో భాగంగా గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం, కర్నూలు జిల్లాలకు చెందిన విద్యార్థులు పందిరి మామిడి ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వెంగయ్య పర్యవేక్షణలో రామకృష్ణా గార్డెన్స్‌ను సందర్శించారు. వీరికి ఘన, ద్రవ జీవామృతం తయారీ, ప్రకృతి వ్యవసాయంపై ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి అవగాహన కల్పించారు.

శ్రీకరం.. శుభకరం



ఏలేశ్వరంలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్తిపాడులో విశ్వేశ్వరస్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

- కార్తిక మాసోత్సవాలు ప్రారంభం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఏలేశ్వరం: కార్తిక మాసం ప్రారంభం కావడంతో సోమవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. స్థానిక ఏలేరు నది ఒడ్డున ఉన్న రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అర్చకులు మహేష్, శేఖర్, వెంకటేష్ ఆధ్వర్యంలో కార్తికమాస వేడుకలు నిర్వహించనున్నారు. కార్తిక సమాసం సందర్భంగా ఏలేరు నది ఒడ్డున నగర పంచాయతీ ఆధ్వర్యంలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

ప్రత్తిపాడు: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారి పంచాయతన క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపారాధనలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. మండలంలోని పెదశంకర్లపూడిలో నగర సంకీర్తన గావించారు. కార్తిక మాసం ముగిసే వరకూ నగర సంకీర్తన నిర్వహిస్తామని హిందూ ధర్మ రక్షా సమితి నాయకుడు కర్రి ధర్మరాజు తెలిపారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని చిల్లంగి శ్రీనివాసనగర్‌లో వేంచేసిన భూసమేత వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరసర గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రత్తిపాడు రూరల్: కార్తిక మాసంలో తొలి రోజు కావడంతో శనివారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని రాచపల్లిలోని అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. రాచపల్లి, ఒమ్మంగి, ధర్మవరం, ప్రత్తిపాడు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఒమ్మంగి ఉమారామలింగేశ్వరస్వామి, శాంతిఆశ్రమం విశ్వనాథుని ఆలయం, గజ్జనపూడి రామలింగేశ్వరస్వామి, ధర్మవరం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ధారపల్లి, ఎరకంపాలెం జలపాతాలకు భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలోని ధ్వజస్తంభాల వద్ద మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు. మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఉత్తరకంచి, ఏలూరు తదితర గ్రామాల్లో నగర సంకీర్తనలు నిర్వహించారు.

పంచారామ క్షేత్రాలకు బస్సు సర్వీసు

తుని: పవిత్ర కార్తిక మాసంలో పంచారామ క్షేత్రాలను దర్శించుకునే భక్తుల కోసం తుని నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు తుని డిపో నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను ఒకే రోజు దర్శించుకోవచ్చునన్నారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్టు ధర రూ.1352 చెల్లించి బుక్ చేసుకోవాలని ఆయన కోరారు. రిజర్వేషన్ కోసం 73829 13016 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అన్నసమారాధన

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన దాత రామకుర్తి నరసింహం ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి రామాలయం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చరణ్ కంటి ఆసుపత్రి డాక్టర్లు రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్ తమ వెంట తీసుకురావాలని సూచించారు.

రేపు మండల సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. మండలంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సీపీఎం నియోజకవర్గ కన్వీనర్‌గా శ్రీనివాస్

తుని: నియోజకవర్గ సీపీఎం కన్వీనర్‌గా నక్కెళ్ల శ్రీనివాస్‌ను ఎన్నికైనట్టు ఆ పార్టీ జిల్లా నాయకుడు శేషుబాబ్జి తెలిపారు. తుని పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశానికి సీపీఎం జిల్లా నాయకులు బేబీరాణి, శేషుబాబ్జి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంఘ సభ్యులు నియోజకవర్గ కన్వీనర్‌గా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో షేక్ పద్మ, మల్లేశ్వరరావు, సాక్షికాదేవి పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనుల ప్రారంభం

తుని రూరల్: నియోజకవర్గంలో గుంతలు లేని రహదారులే లక్ష్యమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తుని మండలం కుమ్మరిలోవలో దెబ్బతిన్న రోడ్డు మరమ్మతు పనులను శనివారం ఆమె ప్రారంభించారు. నియోజకవర్గంలో సుమారు రూ.ఐదు కోట్లతో మరమ్మతుల పనులు చేపట్టినట్టు ఆమె తెలిపారు. జనవరి నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో వృద్ధులకు పింఛన్ల పంపిణీ చేశారు. నాయకులు సుర్ల లోవరాజు, చింతంనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, జక్కాన రామునాయుడు, పోతల రాంబాబు, గేదెల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జనవరి నాటికి గోతులు లేని రోడ్లు

జగ్గంపేట: వచ్చే జనవరి నాటికి గ్రామాల్లో రోడ్లు బాగు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. నియోజకవర్గంలో రహదారుల మరమ్మతుల పనులను శనివారం ఆయన ప్రారంభించారు. జగ్గంపేట శివారులోని పెద్దాపురం వెళ్లే రహదారి, గోకవరం మండలం సూదికొండ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై గోతులను ఆయన స్వయంగా పారపట్టి పూడ్చారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలో రాచపల్లిలో స్కూటర్‌పై సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. రాచపల్లిలో శనివారం పోలీసులు గస్తీ నిర్వహించారు. నడిగట్ల నూకరాజు స్కూటర్‌పై సారా తరలిండగా అదుపులోకి తీసుకుని అతని నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం తొలిరోజును పురస్కరించుకుని విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్తిక మాసంలో నెలరోజుల పాటు నిర్వహించే అన్నదానాన్ని ప్రారంభించారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలోని వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకను ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దీపం పథకం ప్రారంభం

తుని/కోటనందూరు: దీపం పథకంలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. పట్టణంలోని 6వ వార్డు, కోటనందూరు మండలం బిళ్లనందూరులో దీపం పథకం 2.0ను శనివారం ఆమె ప్రారంభించారు. మహిళలకు గ్యాస్ సిలెండర్లను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా ఆశోక్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, యనమల రాజేష్, కమిషనర్ వెంకట్రావు, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.